క్లుప్తంగా

విమ్స్‌కు వెంటిలేటర్ అందజేత



విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబుకు వెంటిలేటర్ అందజేస్తున్న ఇండస్ ఆస్పత్రి యాజమాన్యం

దాబాగార్డెన్స్: విమ్స్ ఆస్పత్రికి రూ.12 లక్షల విలువ చేసే అత్యాధునిక వెంటిలేటర్‌ను ఇండస్ ఆస్పత్రి యాజమాన్యం అందజేసింది. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఇండస్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఎస్.శ్రీధర్, సీఈవో చంద్రమౌళీశ్వరరావు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబుకు బుధవారం దాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఇండస్ ఆస్పత్రి యాజమాన్యం మాట్లాడుతూ సేవా కార్యక్రమంలో భాగంగా విమ్స్‌కు అవసరమైన మరిన్ని సేవలు అందజేయనున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో ఇండస్ ఆస్పత్రి అధికారులు, విమ్స్ ఆస్పత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయండి



గ్రంథాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న సంస్థ జిల్లా కార్యదర్శి కుమార్‌రాజు

అల్లిపురం : గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయాలని, ప్రజలకు గ్రంథాలయాల ఆవశ్యకత తెలిసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి. కుమార్‌రాజు అన్నారు. బుధవారం ఆయన అల్లిపురం శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజుతో మాట్లాడుతూ దగ్గరలోని స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఆహ్వానించి బుక్ ఫెస్టివల్, బుక్ షో వంటి కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. గ్రంథాలయానికి ధరావతులు సేకరించాలన్నారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించాలని తెలిపారు.

భద్రయ్యపేటవాసులకు కిడ్నీ పరీక్షలు



కిడ్నీ వ్యాధిగ్రస్తులకు బాసటగా నిలిచిన బీజేపీ నాయకులు

దాబాగార్డెన్స్: విశాఖ జిల్లా పద్మనాభం మండలం భద్రయ్యపేటకు చెందిన 47 మంది రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల సూచన మేరకు కేజీహెచ్ నెఫ్రాలజీ ఓపీడీ విభాగానికి బుధవారం వచ్చారు. వారికి కిడ్నీ పరీక్షలు చేసినట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. వారికి క్రియాటినిన్ పరీక్ష, అల్ట్రాసౌండ్ స్కానింగ్, రక్తపరీక్షలు నిర్వహించగా 8 మందికి క్రియాటినిన్ లెవల్ పెరిగిందని గుర్తించినట్లు నెఫ్రాలజీ విభాగం ఇన్‌చార్జి ప్రొఫెసర్ డి. రాధాకృష్ణ తెలిపారు. ఇతర వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలని, పరీక్షలు పూర్తయ్యాక పూర్తి స్థాయిలో అవసరమైన వైద్యం అందించాలని సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరిని సూపరింటెండెంట్ ఐ.వాణి ఆదేశించారు. ఎస్‌వీఎస్ ప్రకాష్‌రెడ్డి, రూపాకుల రవికుమార్, దామోదర యాదవ్, దానేష్, సాయి సుదర్శన్ వర్ధన్ కిడ్నీ వ్యాధి బాధితులకు బాసటగా నిలిచారు.

హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

అల్లిపురం: ఖైనీ ప్యాకెట్ అడిగితే ఇవ్వలేదని బటన్ నైఫ్‌తో దాడికి పాల్పడిన వ్యక్తిని టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 21వ తేదీన చలువతోటకు చెందిన దేవుపల్లి విజయ్‌రాజు చలువతోట రోడ్డులో గల వాటర్ ప్లాంట్ సమీపంలోని ఒక కిల్లీ బడ్డీ వద్ద నిల్చున్నాడు. ఆ సమయంలో అదే ప్రాంతానికి చెందిన వాసుపల్లి విజయ్ అక్కడికి చేరుకున్నాడు. విజయ్, విజయ్ రాజుని ఖైనీ ప్యాకెట్టు ఇమ్మని అడిగాడు. అతను ఇవ్వనని చెప్పడంతో కోపగించుకున్న విజయ్ అతనిపై బటన్ నైఫ్‌తో భుజంపై దాడి చేయడంతో విజయ్‌రాజు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

నడినెత్తిపై ముప్పు

- కరెంటు స్తంభాలపై వేలాడుతున్న కేబుళ్లు
- విద్యుత్ స్తంభాలు ఉరితాళ్లుగా మారాయంటూ ప్రజల ఆగ్రహం
- స్పందించే నాథుడే కరవు



దొండపర్తి యూపీహెచ్‌సీ సమీపాన షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద..




దొండపర్తి బజారు వీధిలో..



పూర్ణామార్కెట్ రంగిరీజువీధిలో విద్యుత్ స్తంభానికి అస్తవ్యస్తంగా కేబుల్ వైర్లు



మంథావారివీధిలో..



దొండపర్తి రామాలయం వద్ద..

దాబాగార్డెన్స్: నియోజకవర్గంలో విద్యుత్ స్తంభాలపై ఏర్పాటు చేస్తున్న కేబుల్ టీవీ, ఇంటర్నెట్, టెలిఫోన్ వైర్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. విద్యుత్ స్తంభాలపై కేవలం 4 వరుసలతో మాత్రమే కరెంటు తీగలు ఉంటే.. మిగతా 20 నుంచి 30 వరుసలతో కూడిన వైర్లు కేబుల్, ఇంటర్నెట్, టెలిఫోన్ ఇతరత్రా అవసరాల కోసం వేసినవి.

స్థానికుల ఆందోళన..

దక్షిణ నియోజకవర్గంలోని వన్‌టౌన్, డాబాగార్డెన్స్, అల్లిపురం, ప్రకాశరావుపేట, దొండపర్తి తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలపై వేలాడుతున్న కేబుల్ తీగలు ప్రజలకు ప్రమాదాలు తెచ్చిపెడుతున్నాయి. కేబుళ్లు ప్రధాన రహదారులతో పాటు వీధుల్లో ప్రమాదకరంగా వేలాడుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నియోజకవర్గ పరిధి పలు ప్రాంతాల్లో కేబుల్ తీగలు తెగిపడడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు..

కేబుల్ తీగలపై అధికారుల నియంత్రణ లేకపోవడంతో పరిస్థితి విచ్చలవిడిగా తయారైందని, పిచ్చుక గూళ్ల కంటే దారుణంగా ఉన్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. తెగిపడిన తీగలను సరి చేయక పోవడంతో అవి ఉరితాళ్లుగా మారాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేబుల్ టీవీ తీగలకు బ్రాడ్ బ్యాండ్ తీగలు కూడా తోడవ్వడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. సంబంధిత ఆపరేటర్లు తమ అవసరాలకు తగ్గట్టు తీగలు వేసి వెళ్లిపోతున్నారని, ఇతరులకు ఇబ్బంది కలుగుతుందా? లేదా అని కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఏదైనా ప్రమాదకర పరిస్థితులు తలెత్తితే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు. కేబుల్ తీగలపై అధికారుల పర్యవేక్షణ పెంచాలని, ప్రమాకరంగా ఉన్న తీగలను సరి చేయాలని, స్థానిక కేబుల్ ఆపరేటర్లు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మరమ్మతులకు ఇబ్బందులు..

విద్యుత్ సిబ్బంది స్తంభాలు ఎక్కి మరమ్మతులు చేయాల్సి వచ్చినప్పుడు కుప్పలు తెప్పలుగా ఉంటున్న కేబుల్ తీగలు అడ్డంకిగా మారుతున్నాయి. భారీ క్రేన్లను రప్పించి కేబుళ్లు తగలకుండా పనులు చేయాల్సి వస్తోందని, అయినా ఆ సమయంలో అవి తమ క్రేన్లకు అడ్డు పడుతున్నాయని విద్యుత్ శాఖ సిబ్బంది పేర్కొంటున్నారు. దీనికి తోడు భారీ వాహనాలు వెళ్లినప్పుడు కిందకు వేలాడుతున్న కేబుళ్లు తెగి మెరుపులు కూడా వస్తున్నాయి. దీంతో ఆ మార్గంలో వెళ్లే వారు కేబుళ్లు తగిలి ప్రమాదాల బారిన పడుతున్నారు.

సమన్వయం కరువు..

నగరంలో కమ్యూనికేషన్ వ్యవస్థ పూర్తిగా ప్రైవేటు సంస్థల పరిధిలోనే ఉంది. కేబుల్ టీవీ, ఇంటర్నెట్, టెలిఫోన్ సర్వీసు ప్రొవైడర్లు ఎవరికి వారుగా కంపెనీకి చెందిన 20 నుంచి 30 తీగలను విద్యుత్ స్తంభాలపై ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయంలో మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు ఎలాంటి అభ్యంతరాలు చెప్పకపోవడంతో ఇష్టారాజ్యంగా కేబుళ్లు ఏర్పాటవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ శాఖకు చెందిన స్తంభాలపై కేబుళ్లు ఏర్పాటు చేసేందుకు ఆ శాఖ నుంచి అనుమతి కూడా తీసుకోవడం లేదు. అదే విధంగా మున్సిపల్ కార్పొరేషన్ సైతం ఈ విషయాన్ని పట్టించుకోకపోవడంతో కేబుళ్లు విపరీతంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయంలో సమన్వయంతో వ్యవహరించాల్సిన ప్రభుత్వ శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రజలను మోసం చేసిన బాబు



కార్యక్రమంలో పాల్గొన్న 33వ వార్డు నాయకులు

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ 33వ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో గడప గడపకు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేటికీ అమలు చేయలేదని ప్రజలకు వివరించారు. ప్రజలను మోసం చేసి ఎన్నికల్లో లబ్ధి పొందారని వార్డు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పచ్చిరపల్లి రాము, బల్లిగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఆదారి వెంకట మహేష్, సౌత్ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్య నాయుడు, వార్డు సెక్రటరీ సంతోష్ కుమార్, హేమ, ధర్మ, పీవీఎన్ రెడ్డి, మత్స్యకార నాయకుడు చోడిపల్లి శివకుమార్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కథా కచేరీ

సీతంపేట: సహృదయ సాహితి ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కథా కచేరీలో రచయితలు వివిధ రకాల సమస్యలపై రాసి చదివిన కథలు అలరించాయి. ఈ సందర్భంగా సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కథా రచన సమాజంలో సాంఘిక జీవనం, సమాజ రుగ్మతలు ప్రతిబింబించే విధంగా ఉండాలన్నారు. రచయిత డాక్టర్ సూర్యారావు మాట్లాడుతూ రచయితలకు కథా రచనలో మెలకువలు సూచించారు. రచయితలు కె.వి.ఎస్.మూర్తి, అయ్యల సోమయాజుల ప్రసాద్, దుర్గాప్రసన్న, ఉప్పల అప్పలరాజు, భాగవతుల సత్యనారాయణమూర్తి, చిన సూర్యనారాయణ, చల్లా రాంబాబు, కొత్తూరు రమణ తదితరులు కథలు చదివి వినిపించారు.

వైఎస్సార్‌సీపీలో 100 మంది యువకుల చేరిక



కండువా కప్పి యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ: బుధవారం వంద మంది యువకులు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గం సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. జీవీఎంసీ 39వ వార్డులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. దీనిలో కొందరు వార్డుకు చెందిన యువకులు స్వయంగా వచ్చి వాసుపల్లి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి వాసుపల్లి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి కల్పిస్తామని చంద్రబాబు మాయమాటలు చెప్పారన్నారు. పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం యువతను మోసం చేసిందన్నారు. అమలు కాని హామీలు ఇచ్చి పెడదోవ పట్టించిందన్నారు. జనగన్న ప్రభుత్వం ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, సౌత్ మైనార్టీ అధ్యక్షుడు ముహ్మద్ యాసీన్ బాజ్జీ, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య విభాగం ఆకస్మిక తనిఖీ



బీడీఆర్ సెక్షన్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ బుధవారం జీవీఎంసీ ప్రజారోగ్య విభాగాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. జీవీఎంసీ అన్ని విభాగాల ఉద్యోగులు నిర్ణీత సమయానికే విధుల్లో ఉండాలని ఆదేశించారు. స్టాటస్టికల్ ఆఫీసర్ పీవీడీ ప్రసాదరావు చాంబర్‌లో బర్త్ అండ్ డెత్ వివరాలు, నమోదు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. జీవీఎంసీ పరిధిలో ఎన్ని హాస్పిటల్స్ నమోదై ఉన్నాయో ఆరా తీశారు. 238 హాస్పిటల్స్ రిజిస్ట్రేషన్ అయ్యాయని స్టాటస్టికల్ ఆఫీసర్ తెలిపారు. బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు ప్రస్తుతం ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అర్జీల మేరకు వెంటనే జారీ చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జీవీఎంసీలో రిజిస్ట్రేషన్ కాని బర్త్ అండ్ డెత్ నమోదులు జరిగే క్లినిక్‌లు, ఆస్పత్రులు ఏమైనా ఉంటే సీఆర్ఎస్ పోర్టల్ ద్వారా నమోదయ్యేలా చూడాలని ఆదేశించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో నిర్లక్ష్యం వహించరాదని ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్‌ను కమిషనర్ ఆదేశించారు.

కుటుంబాల చెంతకు మహిళలు



డాలీని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఏయూటీడీ సిబ్బంది



మాధురిని పాపతో సహా కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ప్రగడ వాసు

అల్లిపురం: బీచ్ రోడ్డులో తిండిలేక నీరసించిపోయి దీన స్థితిలో ఉన్న మహిళ సమాచారం మూడవ పట్టణ పోలీసుల ద్వారా తెలుసుకున్న ఏయూటీడీ సిబ్బంది ఆమెకు జీవీఎంసీ మహిళా షెల్టర్ హోంలో ఆశ్రయం కల్పించారు. ఆమెను విచారించగా తన పేరు డాలీ (65) అని, అసలు పేరు పుష్పలత మిశ్రా అని తెలిపింది. ఒడిశాలోని సుందర్ ఘడ్ జిల్లా రూర్కెల దగ్గర రఘునాథపలి గ్రామానికి చెందిన ఆమె భర్త చనిపోయాక మానసికంగా కుంగిపోయింది. ఇద్దరు కొడుకుల్ని వదిలి ఐదేళ్ల క్రితం ఇల్లు వదిలి వచ్చేసింది. పిల్లల చదువులు ఆగిపోయాయి. కుటుంబ సభ్యులందరూ వెతకడం మొదలుపెట్టారు. ఆచూకీ తెలియక చనిపోయిందనుకున్నారు. షెల్టర్‌లో ఆరు నెలలు ఉంచి శ్రద్ధా సంస్థ ద్వారా చికిత్స అందించాక ఆమె కోలుకుంది. దాంతో ఆమెను కొడుకు బిశ్వజిత్ మిశ్రా, సోదరుడు రాజు మిశ్రాకి అప్పగించడంతో వారు హర్షం వ్యక్తం చేశారు.

కుటుంబం చెంతకు వివాహిత..

విజయనగరం జిల్లాకు చెందిన బండుమల్లి మాధురి (21) ఆడపడుచుతో గొడవ పడి తన రెండేళ్ల పాపను తీసుకుని ఈ నెల 15వ తేదీన విశాఖపట్నం వచ్చేసింది. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆమెను గుర్తించిన చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సిబ్బంది తల్లీబిడ్డను టీఎస్సార్ ఏయూటీడీ మహిళా వసతి గృహంలో అప్పగించారు. బాధితురాలి వివరాలు తెలుసుకున్న షెల్టర్ సిబ్బంది ఆమె కుటుంబ సభ్యులను రప్పించారు. ఇరుపక్షాలకు కౌన్సెలింగ్ నిర్వహించి సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు సమక్షంలో భర్త బంటుమిల్లి గౌరినాయుడు, అత్త లక్ష్మి, ఆడపడుచు వరలక్ష్మికి పాపతో పాటు మాధురిని అప్పగించారు.

ఉత్సాహంగా బీసీఏ విద్యార్థుల వీడ్కోలు వేడుక

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ సమత కళాశాల బీసీఏ విద్యార్థుల వీడ్కోలు వేడుక ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సంప్రదాయ, పాశ్చాత్య గీతాలకు నృత్యాలు చేస్తూ విద్యార్థులు ఆడిపాడారు. పలువురు విద్యార్థులు చదువు విశిష్టతను, సమాజ ప్రగతిని తెలియజేస్తూ చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ యువతను అభివృద్ధి దిశగా నడిపించేది చదువు ఒక్కటేనన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రానున్నది జగనన్న పాలనే

- అబద్ధాల పాలన ఇక మూడేళ్లే
- రాష్ట్రంలో సంక్షేమం సున్నా
- పవన్.. ప్రజల పక్షాన నిలబడు
- మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి



మాట్లాడుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్



39వ వార్డులో పార్టీ శ్రేణులు, ప్రజలతో కలిసి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమానికి వస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ: కూటమి అబద్ధాల పాలనకు ఇంకా మూడేళ్లేనని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. బుధవారం జీవీఎంసీ 39వ వార్డులో వార్డు అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ యాసీన్ (బాజ్జీ) ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమానికి విచ్చేసిన వాసుపల్లికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్‌టౌన్‌లో పుట్టానన్నారు. ఇక్కడి వారి సమస్యలు, బాధలు అన్నీ తెలుసన్నారు. అందుకే పేదల పక్షాన ఉన్నానని చెప్పారు. ప్రస్తుత ఎమ్మెల్యే ప్రజల వద్దకు వస్తున్నారా? అని ప్రశ్నించారు. పదవి ఉన్నా లేకపోయినా రోజూ ప్రజల మధ్యనే తిరుగుతూ వారి శ్రేయస్సు కోరుతున్నానన్నారు. చంద్రబాబు సొంత మామకే కాకుండా ప్రజలకు కూడా వెన్నుపోటు పొడుస్తున్నారన్నారు. తల్లికి వందనం సంవత్సరం ఇవ్వకుండా రెండవ సంవత్సరం సగం మందికే ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. మహిళలకు రూ. 18 వేలు ఇస్తామని చెప్పి ఆ మాటే ఇప్పుడు మాట్లడడం లేదని.. చంద్రబాబు నిజస్వరూపం ఇదేనన్నారు. ఇప్పటికైనా మోసాలు ఏమిటో తెలుసుకోవాలన్నారు. జగనన్న హయాంలో 5 లక్షల కోట్లకు పైగా నిధులతో సంక్షేమం అందించారన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ ద్వారా ఎందరో పేదలు ఆపరేషన్లు చేయించుకుని ఇంటికి వస్తే వారికి ఇంటి వద్ద కూడా నెలకు రూ. 4 వేలు ఇచ్చేవారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆస్పత్రికి వెళ్లే ముందుగానే డబ్బులు చెల్లించాలని చెబుతున్న స్థితికి రాష్ట్రాన్ని తీసుకువచ్చారన్నారు. ఆరోగ్యసురక్ష వంటి సేవలు ఏవని ప్రశ్నించారు.

ప్రశ్నిస్తానన్న పవన్ ఎక్కడ?

ప్రజల పక్షాన నిలబడతానన్న పవన్ కల్యాణ్ ఎక్కడని వాసుపల్లి ప్రశ్నించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందడంలేదు. మీ నాయకుడు చంద్రబాబు చెప్పిన సూపర్ సిక్స్ నీవైనా అమలు చేయించావా? ఇదేనా ప్రజల పక్షాన నిలబడడం అంటే? అని వాసుపల్లి మండిపడ్డారు. నీ సినిమా టిక్కెట్ రూ. 700గా నిర్ణయించారు. నీ అభిమానుల్లో ఎక్కువ మంది పేదలే ఉన్నారు. వారి గురించి ఆలోచించావా? అని నిలదీశారు. సొంత మామానే వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు రేపు నీకు కూడా పొడవడని నమ్మకం ఏమిటి? అంటూ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, సీనియర్ నాయకులు రామానంద్, ముత్తు నల్లబాబు, చిట్టి కృష్ణ, సత్య, కమల్, ఇబ్రహీం, షిలార్, రవి, మాధురి, ఆదిలక్ష్మి, సిరాజ్ ఉన్నీషా, ఈశ్వరి, ఆది, రాజేష్, ధనరాజ్, సలీమ్, దూడ తాతారావు, వెంకటి, కాంత, ధనరాజ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌గా ముజీబ్‌ఖాన్‌ను గెలిపించుకుందాం..

ఇప్పటి వరకు వైఎస్సార్‌సీపీలో చెత్త ఉండేదని దానిని సముద్రంలో కలిపేశామని వాసుపల్లి అన్నారు. ముజీబ్‌ఖాన్ పార్టీకి ఎనలేని సేవలందించారని అన్నారు. అందుకే కార్పొరేటర్‌గా ఆయనను గెలిపించుకుదామని వాసుపల్లి అన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.1.50 లక్షల విరాళం



ఎస్‌బీఐ పెన్షనర్స్ క్లబ్ ప్రతినిధులకు బాండ్ అందజేస్తున్న ఏఈవో తిరుమలేశ్వరరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం నగరంలోని సిరిపురానికి చెందిన ఎస్‌బీఐ పెన్షనర్స్ క్లబ్ రూ.1.50 లక్షల విరాళం అందజేసింది. సింహగిరికి వచ్చిన క్లబ్ ప్రతినిధులు విరాళాన్ని నగదు రూపంలో పీఆర్‌వో కార్యాలయంలో అందజేశారు. వారికి దేవస్థానం తరపున ఏఈవో తిరుమలేశ్వరరావు బాండ్ అందజేశారు. ఆలయ అధికారులు స్వామి దర్శనం కల్పించి ప్రసాదం అందించారు.

ఘనంగా బీఎంఎస్ వ్యవస్థాపక దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న యూనియన్ నాయకులు, ఉద్యోగులు

దాబాగార్డెన్స్: కార్మికుల పక్షాన నిలబడి, సమస్యల పరిష్కారానికి నిజాయితీగా పోరాడేది భారతీయ మజ్దూర్ సంఘ్ మాత్రమేనని ఇండియన్ నేవీ సివిలియన్ మజ్దూర్ సంఘ్ గౌరవ అధ్యక్షుడు పైలా దేముడునాయుడు తెలిపారు. నేవల్ డాక్‌యార్డ్ విజయనగర్ గేట్ ఎదురుగా బీఎంఎస్ 70వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఐఎన్‌సీఎంఎస్ అధ్యక్షుడు పుట్టా విద్యాసాగర్, కార్యదర్శి ఎస్.రాజేష్, బీఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చింతాడ రమణతో కలిసి దేముడునాయుడు జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల సంక్షేమంతో పాటు వారి న్యాయమైన హక్కుల సాధన, కార్మికుల్లో దేశభక్తిని నింపేందుకు, తాము పని చేసే పరిశ్రమల పురోభివృద్ధే పరమావధిగా బీఎంఎస్ పని చేస్తుందన్నారు. యాజమాన్యాల్ని బెదిరించి పరిశ్రమలు ఖాయిలా పడేలా అనైతిక సమ్మెకు దిగే విధానాన్ని బీఎంఎస్ వ్యతిరేకిస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సత్యానందం, బి.సత్య శ్రీనివాస్, కె.వెంకట్‌నాయుడు, పంపా రవికుమార్, పి.సురేష్, పెదపాటి రాజు, అల్లిపల్లి నరసింహరాజు, ఆదారి రమేష్, రావత్, గొన్నా మహేష్, అశోక్‌కుమార్, మళ్ల మోహనరావు, కె.వెంకటేశ్వరరావు, సాహూ, మెటీరియల్ ఆర్గనైజేషన్ నాయకులు శ్రీనుబాబు, సంపత్, శేషు, రామకృష్ణ, వర్క్స్ కమిటీ సభ్యులు ముత్తిరెడ్డి శ్రీనివాస్, జగదీష్, యోగిత, బి.లక్ష్మణరావు, బండారు శివ, కాసుబాబు, సంఘ సభ్యులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలకు స్పీచ్ థెరపీలో శిక్షణ



చిన్నారికి స్పీచ్ థెరపీ శిక్షణ ఇస్తున్న థెరపిస్ట్ బాలేశ్వరి

సీతంపేట: కలెక్టర్, విద్యా శాఖాధికారి, సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త ఆదేశాల మేరకు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని భవిత సెంటర్‌లో బుధవారం దివ్యాంగ పిల్లలకు స్పీచ్ థెరపీలో శిక్షణ ఇచ్చారు. నగరంలోని సీతమ్మధార, గోపాలపట్నం, మహారాణిపేట, పెందుర్తి, చినగదిలి ఐదు మండలాలకు చెందిన స్పీచ్ ప్రాబ్లం ఉన్న 70 మంది దివ్యాంగ పిల్లలు పాల్గొన్నారు. వీరికి భాష ఉచ్చరణలో అభివృద్ధి సాధించేందుకు స్పీచ్ థెరపిస్ట్ బాలేశ్వరి శిక్షణనిచ్చారు. పిల్లలకు, తల్లిదండ్రులకు స్పీచ్ థెరపీకి సంబంధించి అత్యంత ముఖ్యమైన మెళకువలను తెలియజేశారు. వారంలో రెండు రోజుల చొప్పున ప్రతి మండలానికి ఒక కేంద్రంగా స్పీచ్ థెరపీ అవసరమైన పిల్లలందరికీ జిల్లాలోని అన్ని మండలాలు కవర్ అయ్యేలా శిక్షణ ఇస్తామని బాలేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్, అదనపు పథక సమన్వయకర్త డాక్టర్ జె.చంద్రశేఖర్, సీతమ్మధార మండల విద్యా శాఖాధికారులు రామారావు, బాలామణి, పాఠశాల హెచ్ఎం జయంతి రాధాకుమారి, ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.